క్లుప్తంగా

25న జాబ్ మేళా

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏ నరసింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీల్ ఇండియా లిమిటెడ్, ఏపీ ఫైబర్‌నెట్, ఎస్‌బీఐ కార్డ్స్, తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో చదివిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 91778 24585 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



అల్లూరు: మండలంలోని అల్లూరుపేట, గోగులపల్లి గ్రామాల్లోని వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి, కేవీకే శాస్త్రవేత్త ఓబయ్య, ఏఓలు గీతాకుమారి, వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. రైతులకు ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ పై అవగాహన కల్పించారు.

పేదలకు నిత్యావసర సరుకుల వితరణ



కావలి : పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న డీఆర్ విశ్వోదయ సేవా సమితి కార్యాలయంలో నిరుపేద వృద్ధులకు నిత్యావసర సరుకులను శనివారం వితరణ చేశారు. పట్టణానికి చెందిన 60 మందికి రూ.60వేల విలువ చేసే బియ్యం, ఇతర సరుకులను అందజేశారు. కావలి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పీ పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాదాత డీఆర్ పేరు మీద పేద వృద్ధులకు నిత్యావసర సరుకులను వితరణ చేస్తున్న కుమారులు వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, జేబీ బీఎస్సీ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు భాగ్యలక్ష్మి, మౌనిక, గ్రేసి, తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు నివాళి



ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ జీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఉయ్యాలవాడ చిత్రపటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాడిన ఉయ్యాలవాడను తెలుగురాష్ట్రాల్లో స్వాతంత్ర్య సమరయోధుడిగా కీర్తిస్తున్నారన్నారు. ఉయ్యాలవాడను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు పోరాట పటిమను అలవర్చుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి జీ రమేష్, అధ్యాపకులు గోపీకృష్ణ, రఘునాథరెడ్డి, సునీత, ఏఓ కమలప్రియ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



కావలి: పట్టణానికి చెందిన శ్రీసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముసునూరులోని కస్తూర్బా విద్యాలయంలోని పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సంధ్యారాణి మాట్లాడుతూ పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ పరీక్ష సామగ్రిని అందజేసిన శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు చల్లగొళ్ల కృష్ణకుమార్, మాధురి దంపతుల సహకారంతో పరీక్ష సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్‌ఫోర్స్‌కు చెందిన చాకలి కొండ శారదమ్మ, మంజుల, హెప్సి సైమన్, ప్రవీణ, రాజేశ్వరి, వరలక్ష్మి, .శ్రీసాయి ట్రస్ట్ సభ్యులు అళహరి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం సెలవు దినమైనప్పటికీ యథావిధిగా పనిచేస్తాయని ఆత్మకూరు డీఈ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్బీకేలకు ఉరి

రైతు నేస్తాలుగా నాడెంతో సేవలు

- రైతుల ఇంటి ముంగిటకే విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా
- తాజాగా రైతుసేవా కేంద్రాలుగా మార్పు
- సేవలూ అంతంత మాత్రమే
- క్రమంగా నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం కుట్రలు





మూలకు చేరిన కియోస్క్‌లు



ఆర్బీకే ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్న దృశ్యం (ఫైల్)

కావలి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతలు ఊరు దాటకుండా విత్తనం నుంచి పంటల విక్రయం వరకు అన్ని రకాలుగా సేవలందించిన రైతుభరోసా (రైతుసేవా) కేంద్రాలకు ఉరివేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా అందించే ఎరువులు, పురుగు మందులు, తదితర సేవలను కుదించి ఆర్‌బీకే వ్యవస్థను నిర్వీర్యం చేసిన సర్కారు తాజాగా రేషనలైజేషన్ పేరుతో వాటికి మంగళం పాడేందుకు కసరత్తు చేస్తోంది. పట్టణ ప్రాంతాలతో పాటు తీరప్రాంతాల్లోని వాటిని ఎత్తివేయాలని నిర్ణయానికి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో సాగువిస్తీర్ణం ఆధారంగా రెండు, మూడి ంటిని విలీనం చేసి భారీగా కుదించాలని భావిస్తోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రైతు నేస్తాలుగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనాల పంపిణీ నుంచి పంట కొనుగోలు వరకూ ప్రతీ దశలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేయూతను అందించడంతో వ్యవసాయం పండగలా సాగింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్బీకేలు రైతు నేస్తాలుగా మారి వ్యవసాయంలో నూతన శకానికి నాంది పలికాయి. 2020 మేలో ప్రారంభించిన ఆర్బీకేలను దశలవారీగా బలోపేతం చేశారు. రైతులు ఊరు దాటకుండా వారికి అవసరమైన భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, తదితర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే రైతులు పండించే ధాన్యం దళారుల పాలు కాకుండా ఆర్బీకేల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను అందజేసే పరిస్థితి ఉండేది. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికి ఉచిత పంటల బీమా వర్తించేది. పంటలు నష్టానికి గురైన సమయంలో ఎన్యూమరేషన్ నిర్వహించి వీలైనంత త్వరగా రైతులకు పరిహారాన్ని అందజేయడంలో వీటి పాత్ర కీలకంగా ఉండేది. వ్యవసాయ అనుబంధ శాఖలైన పశుసంవర్థక, సూక్ష్మసేద్యం, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల్లో రాయితీలను పొందాలనుకునే రైతులు ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉండేది. వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆర్బీకేల పనితీరును పరిశీలించి ప్రశంసించారు.

ఇదీ గత పరిస్థితి

కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణం, మండలం, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లోని వరి, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల సాగు అధికంగా ఉంది. గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం పల్లెల నుంచి మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. విత్తనాలు, ఎరువులకు డిమాండ్ అధికంగా ఉండే సందర్భాల్లో బ్లాక్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీంతో రైతులు అల్లాడిపోయేవారు. ధాన్యం చేతికి వచ్చిన తరువాత కూడా ఒకటీఅరా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు లేకపోవడం, సిబ్బంది కొరత, మిల్లర్లతో ప్రభుత్వ సమన్వయం లేకపోవడంతో పంటకు కనీస మద్దతు ధరను కూడా పొందలేకపోయేవారు. రోడ్ల పక్కన ధాన్యం ఆరబెట్టుకుని విధి లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్‌బీకే వ్యవస్థను తీసుకురావడంతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మారుమూల గ్రామాల్లోనూ ఆర్బీకేలను ఏర్పాటు చేయడంతో రైతులు గ్రామం దాటకుండానే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందడం, పండించిన పంటను కూడా దర్జాగా మద్దతు ధరకు అమ్ముకోవడం సాధ్యమైంది. దీంతో గతంతో పోలిస్తే సాగు విస్తీర్ణం కూడా 20 శాతానికి పైగా పెరిగింది. కావలి నియోజకవర్గ వ్యాప్తంగా ఏటా ఖరీఫ్ సీజన్‌లో 2వేల క్వింటాళ్లు, రబీ సీజన్‌లో 5వేల క్వింటాళ్లకు పైగా నాణ్యమైన విత్తనాలను రైతులకు రాయితీపై అందించేవారు. అకాల వర్షాలతో నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై మళ్లీ విత్తనాలు అందించేవారు. అలాగే ఏటా సుమారు 2వేల టన్నులకుపైగా పైగా ఎరువులను కూడా రైతులకు అందించే వారు. పంట కోతల సమయంలో ఏటా 1,50,000 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు కనీస మద్దతు ధర అందించే వారు. అందుకు సంబంధించి ముందస్తుగా ఏటా సుమారు 15వేల మంది రైతుల పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసేవారు. అలాగే భూసార పరీక్షలను నిర్వహించి సూక్ష్మ, స్థూల పోషకాలను అంచనా వేసి రైతులకు ఏఏ పంటలు పండించుకోవాలి..ఎంత మేర ఎరువులు వేయాలి..తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పెట్టుబడులు గణనీయంగా ఆదా అవుతుండేవి. ఆర్బీకేల్లో ఉన్న రైతుల వివరాల ఆధారంగా సిబ్బంది పంటల బీమా చేయడంతో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోతే వెంటనే పరిహారం అందించే వారు. ఇలా ఆర్బీకేల ద్వారా అందించే సేవలతో పాటు రైతుభరోసా పథకం ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కావలి నియోజకవర్గంలోని 35వేల మంది రైతులకు రూ.225 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి.

ఆర్బీకేల వివరాలు

కావలి నియోజకవర్గంలోని కావలి, కావలి రూరల్, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో 63 ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో 30 ఆర్బీకేలకు సొంత భవనాలు ఉండగా, 33 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఒక్కో ఆర్బీకే భవన నిర్మాణానికి రూ.23.94లక్షల వంతున ఖర్చు చేసి నిర్మించింది. ప్రస్తుతం 44 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

నేడు దయనీయం

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చారు. సేవలను అంతంతమాత్రంగానే అందిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంటల బీమా పథకం, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రైతు సేవా కేంద్రాల సంఖ్యను కూటమి ప్రభుత్వం తగ్గించేందుకు కసరత్తు చేస్తుండడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్బీకేలతో ఎంతో మేలు



రైతుభరోసా కేంద్రాలు క్రియాశీలంగా పని చేస్తున్నప్పుడు రైతులకు అన్ని రకాలుగా మేలు చేశాయి. ఇప్పుడు వాటి ద్వారా అందిస్తున్న సేవలు ఏమీ లేకపోవడంతో రైతులు ఏదైనా ఇబ్బంది వస్తే ఎవర్ని అడిగాలా తెలియక అందర్నీ ఆరా తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఉండడం వల్ల రైతుకు ప్రభుత్వ పరంగా అవసరమైన సమాచారం తక్షణమే అందుతుంది.

–శ్రీహరి, రైతు, అల్లూరు

రైతులకు అండగా ప్రభుత్వం

- మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

సంగం: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులకు అండగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయించి ఆ దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సంగంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పరపతి సంఘం భవనాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పీపీసీ సెంటర్‌కు ధాన్యం తరలింపు సమయంలో పడుతున్న ఇబ్బందులు, మిల్లర్ల నుంచి ఎదురవుతున్న సమస్యలు, ధాన్యం తరలింపు బకాయిలు, ధాన్యం కళ్లాలు, తదితర సమస్యలను విన్నవించారు. అనంతరం నాదెండ్ల మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ రైతుల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో 33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,480 కోట్లను జమ చేశామని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు బకాయిలను సోమవారం లోగా రైతుల ఖాతాల్లో జమచేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ఆనం మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారని, 11 మిలియన్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాములను నిర్మిస్తున్నామన్నారు. రైతులకు మద్దతు ధరను అందించేందుకు జిల్లాలోని 78 సహకార సంఘాల పరిధిలో 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం కొరిమెర్ల సమీపంలోని పెంచలనాయుడు రైస్ మిల్లును పరిశీలించారు. బియ్యం నాణ్యతను నాదెండ్ల తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని మిల్లు యజమానులకు సూచించారు. రైతులను మోసం చేస్తే మిల్లర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, జేసీ కార్తీక్, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, డీసీఓ గుర్రప్ప, ఎన్‌డీసీసీ బ్యాంకు సీఈఓ శ్రీనివాసరావు, సంగం పీఏసీఎస్ చైర్మన్ కట్టా సుబ్రహ్మణ్యం, సీఈఓ దస్తగిరి అహ్మద్, ఆత్మకూరు ఆర్డీఓ పావని, తహసీల్దార్ సోమ్లానాయక్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, టీడీపీ నాయకులు గుండ్లపల్లి శ్రీనివాస్‌యాదవ్, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బాబు, చౌదరి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి

సోమశిల: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాపూరు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలన్నారు. ప్రజాప్రతినిధులు విన్నవించే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. తొలుత తాగునీటిపై సమీక్షించగా పలువురు సర్పంచ్‌లు తాగునీటి సమస్యలను విన్నవించారు. వేసవిలోగా సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు మండలంలోని 15 పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా మార్చేందుకు ప్రతిపాదించామని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడంతో నిలిపివేశామన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఫీల్డ్‌అసిస్టెంట్ల మార్పు సమస్యతో గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభంకాక పేద ప్రజలు నష్టపోతున్నారని విన్నవించారు. వెంటనే సమస్యను పరిష్కరించి కూలీలకు ఉపాధి కల్పించాలని ఏపీఓను కోరారు. జగనన్న కాలనీల్లోని మిగిలి ఉన్న ప్లాట్ల ఆక్రమణలపై స్థానికులు ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, ఇలాంటి ఘటనలపై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని, అసలు ప్లాట్లు ఎవరి పర్యవేక్షణలో ఉన్నాయో తెలియజేయాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులను జెడ్పీటీసీ ప్రశ్నించారు. ఇందుకు ఆర్ఐ స్పందిస్తూ వెంటనే వీఆర్వోల ద్వారా విచారించి ఆక్రమణకు గురైన ప్లాట్లను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అనంతరం ఇటీవల ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. వైస్‌ఎంపీపీలు పాశం శ్రీనివాసులు, అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

ఉదయగిరి/దుత్తలూరు: ఉదయగిరి మండలం గడ్డంవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్షయ వ్యాధిపై గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు కే వెంకటసుబ్బయ్య శనివారం అవగాహన కల్పించారు. క్షయ, కేన్సర్ లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. హెచ్‌ఎం మాలకొండయ్య ,ఉపాధ్యాయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దుత్తలూరు పీహెచ్‌సీ ఆరోగ్య బోధకులు బీబీజాన్, హెల్త్ సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్ నందిపాడులోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్థులకు క్షయ వ్యాధిపై కల్పించారు. ప్రిన్సిపల్ అంజనీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుబీమాపై అవగాహన

వరికుంటపాడు: మండలంలోని పెదిరెడ్డిపల్లి పశువైద్యశాల పరిధిలోని పాడి రైతులకు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్రశర్మ పశుబీమాపై శనివారం అవగాహన కల్పించారు. పాడి పశువులు ప్రమాదవశాత్తు చనిపోతే పాడి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం పశుబీమాను అమలు చేస్తోందని తెలిపారు. పశుబీమా చేసుకుంటే ఏదైనా ప్రమాదం జరిగి పాడి పశువు చనిపోతే పరిహారం అందుతుందని చెప్పారు. పాడి రైతులు రైతుసేవా కేంద్రాల్లోని పశుసంవర్ధక శాఖ సహాయకులను సంప్రదించి పశుబీమా చేసుకోవాలని కోరారు.

పోలీసుల జోక్యంతో కుమారుల చెంతకు తల్లి

సాక్షి ఎఫెక్ట్..

సోమశిల: పోలీసుల జోక్యంతో ఎట్టకేలకు రేవూరుకు చెందిన వృద్ధురాలు మద్దలూరి చిన్నక్కను కుమారులు ఇంట్లోకి రానించారు. ఇటీవల చిన్నక్క జారి పడి గాయపడగా కుమార్తె తీసుకెళ్లి వైద్యం చేయించింది. శుక్రవారం ఊరికి పంపగా నలుగురు కుమారులు ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో ఆమె దీనంగా రోడ్డుపై ఉండిపోయింది. ఈ విషయమై 'సాక్షి' లో 'తల్లిని ఇంట్లోకి రానివ్వని కుమారులు' అనే శీర్షికన శనివారం కథనం ప్రచురితం కావడంతో పోలీసులు స్పందించారు. కుమారులతో మాట్లాడి చిన్నక్కను ఇంట్లోకి పంపించారు. ఇకపై వృద్ధురాలిని ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో చిన్నక్క సంతోషం వ్యక్తం చేసింది.

చిరుధాన్యాలపై అవగాహన




చేజర్ల: మండలంలోని నెర్నూరులో రైతులకు చిరుధాన్యాలు–వాటి ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజా కుమారి చిరుధాన్యాల్లోని పోషక విలువలను తెలియజేశారు. పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ షేక్ హసీనాభాను చిరుధాన్యాల ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు.ఏఓ వీ శశిధర్ విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పించారు.

వైభవంగా గరుడ సేవ



అల్లూరు: అల్లూరుపేటలోని కోదండ రామాలయంలో గరుడ వాహన సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. మినర్వగ్రాండ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ చైర్మన్ అల్లంపాటి లోకేశ్వర్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు.

ఆటపాటలతో బోధన అందించాలి



ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో బోధనను అందించాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు అంగన్‌వాడీలకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతిపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. చిన్నారులను బాధ్యతగా చూసుకుంటూ బోధనోపకరణాలు, కృత్యాల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. హెచ్‌ఎం బాలకేశవులు, రిసోర్సుపర్సన్లు సారథి, సుబ్బారెడ్డి, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సుపైకి ఒరిగిన లారీ

బిట్రగుంట: బోగోలు ప్రధాన కూడలిలోని 144వ నంబరు రైల్వే ఎల్‌సీ గేటు వద్ద శనివారం ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు..చామదల నుంచి 30 మంది ప్రయాణికులతో బోగోలు మీదుగా నెల్లూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు రైల్వేగేటు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి ఓ వైపు రాసుకుంటూ వెళ్లింది. దీంతో బస్సుకు చెందిన రెండు కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రైల్వేగేటుకు ఇరువైపులా దుకాణాలు రోడ్డుపైకి చొచ్చుకురావడం, వాటి ముందు పార్కింగ్ చేసే వాహనాలతో తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ కారణంగానే తాజా ఘటనలో బస్సును లారీ ఒకవైపు రాసుకుంటా వెళ్లాల్సి వచ్చింది. రైల్వే, పోలీసు అధికారులు స్పందించి గేటు వద్ద ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సిద్ధేశ్వరాలయ ముఖద్వారం ప్రారంభం



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

సీతారామపురం : మండలంలోని ప్రాచీన శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరాలయానికి వెళ్లే దారిలో పోలంగారిపల్లి సమీపాన నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాయపల్లి గ్రామానికి చెందిన కొమరశెట్టి వెంకట సుబ్బారావు సుమారు రూ.30 లక్షల వ్యయంతో ముఖద్వారం నిర్మించడం అభినందనీయమన్నారు. పరమశివుడి ఆశీస్సులు సుబ్బారావుపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వేద పండితులు నిర్వహించిన గణపతి పూజ, రక్షా బంధనం, నవగ్రహ పూజ, కలశస్థాపన, ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా బాలాయపల్లికి చెందిన ఉపాధ్యాయుడు ఎడమ తిరుపతయ్య ముఖద్వారం ప్రారంభోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వైద్యశాలలో తనిఖీలు



కలిగిరి: కలిగిరిలోని నూరు క్లినిక్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలిగిరిలో నూర్ క్లినిక్ పేరుతో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారని గ్రామానికి చెందిన పీసీ మంజూన్‌రావు ఫిర్యాదు చేశారని తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు క్లినిక్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. క్లినిక్‌లో వైద్యం చేస్తున్న ఆరిఫ్‌కు సంబంధించిన ఏపీ మెడికల్ కౌన్సిల్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను పరిశీలించినట్లు చెప్పారు. క్లినిక్ నిర్వహణకు జిల్లా వైద్యారోగ్యశాఖ నుంచి అనుమతులు పొందాలని సూచించామని తెలిపారు.

అస్తవ్యస్తంగా జలజీవన్ మిషన్ పనులు



బిట్రగుంట: జలజీవన్ మిషన్ పనులతో రూపుకోల్పోయిన రోడ్డు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో జలజీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. అధికారులతో కాంట్రాక్టర్లు కుమ్మకై పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. పైపులైన్లు వేసే క్రమంలో రోడ్లను ధ్వంసం చేస్తున్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయం నుంచి యాదవపాళెం వరకు జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా పైప్‌లైన్ల కోసం రోడ్డు పక్కన గుంతలు తీశారు. పైపులైన్లు వేసిన తరువాత గుంతలను సరిగా పూడ్చకపోవడం, పలుచోట్ల పైప్‌లైన్ల లీకేజీల కారణంగా రోడ్లు రొచ్చురొచ్చుగా మారుతుండడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు నెలరోజులుగా నరకం చూస్తున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అడ్రస్ లేకపోవడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ల లీకేజీలు అరికట్టడంతో పాటు గుంతలు పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వన్‌బీ, అడంగల్ సమస్యలను పరిష్కరించాలి

ఉదయగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపల్లెలో రైతు సంఘం ఆధ్వర్యంలో కొండ కింది పంచాయతీల్లోని రైతులు వన్‌బీ, అడంగల్ సమస్యలను పరిష్కరించాలని శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన భూముల రీసర్వేలో దొర్లిన తప్పులను రెవెన్యూ అధికారులు సరిదిద్దకపోవడంతో రైతులకు అవసరమైన అడంగల్, వన్ బీ పత్రాలు ఆన్‌లైన్‌లో రావడం లేదన్నారు. ఈ కారణంగా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందజేస్తున్న సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటుతున్న రైతు సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని, లేకపోతే రెవెన్యూ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎంపీటీసీ కాకు విజయమ్మ పాల్గొన్నారు.